ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 | సంచిక : 08 | ఏప్రియల్ 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 12
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551



ఈ సంచికలో....
జిన్నూరు ... 27-02-14



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-02-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు మహాశివరాత్రి. శివుడు లింగరూపం ధరించినరోజు. కృష్ణుడిని, రాముడిని అవతారపురుషులు అంటారు. కాని శివుడు నిత్యావతారం అంటే నిత్యముగా ఉండేవాడు. శివరాత్రి రోజున ఆయన లింగరూపం ధరించాడు. పరమేశ్వరుడికి రూపంలేదు, నామంలేదు, గుణంలేదు. నిర్గుణుడు, నిరాకారుడు అయిన పరమేశ్వరుడిని పట్టుకోవటం చాలాకష్టం ఎందుచేతనంటే మనం ఒక రూపంతోటి, ఒకనామంతోటి, గుణాలతోటి తాదాత్మ్యం పొంది ఉన్నాము. లింగం అంటే గుర్తు. అంటే శివలింగాన్ని గుర్తుగా తీసుకుని, ఆ లింగాన్ని ధ్యానించి నామ రూపాలకు, గుణాలకు అతీతమైన పరమేశ్వరుడి స్వరూపాన్ని పొందమని పెద్దలు చెప్పారు. ప్రతీ నెల మనకు శివరాత్రి వస్తుంది దానిని మాసశివరాత్రి అంటారు. శివభక్తులు మాసశివరాత్రి రోజున కూడా ప్రత్యేకంగా అభిషేకాలు చేస్తారు. శివుడు అభిషేకప్రియుడని, విష్ణువు అలంకారప్రియుడని, సూర్యుడు నమస్కార ప్రియుడని, కుమార స్వామి దర్శనప్రియుడని చెపుతారు. జన్మకోశివరాత్రి అని చాలామంది అంటూ ఉంటారు. ప్రతీ దేహధారులకు తిండి, నిద్ర, కామం ఈ మూడు అంటే బాగా యిష్టం. జన్మకో శివరాత్రి అంటే కనీసం ఈ శరీరం మరణించేలోపు ఒక్క శివరాత్రి రోజున అయినా ఈ మూడింటికి

దూరంగా ఉండి శివస్మరణలో గడపండి. ప్రతీ శివరాత్రికి మీరు చేయలేకపోయినా జన్మలో ఒక శివరాత్రి రోజున అయినా ఈ మూడు నియమాలను అంటే నిరాహారంగా ఉండటం, జాగరణ చేయడం, కామం లేకుండా ఉండటం వీటిని పాటించి ఒక మహాశివరాత్రిని అయినా మీరు ఎంజాయ్ చెయ్యండి.

హోలీకంపెనీ నేచురల్ గాలి వంటిది. హోలీకంపెనీ నిన్ను మహోన్నత శిఖరాలకు మోసుకొనిపోతుంది. దానితో పోల్చదగినది ఇంకోటి ఏమీ లేదు. సైలెన్స్ ఈజ్ నెవ్వర్ ఎండింగ్ స్పీచ్. ఇప్పుడు నాన్నగారు మాట్లాడుతున్నారు అంటే యింకో గంటలో ముగింపు అయిపోతుంది కాని మౌనం అలా మాట్లాడుతూనే ఉంటుంది. దానికి ముగింపు లేదు, దానికి విరామం లేదు. దానిని అందుకోగల శక్తి మీకు ఉంటే, అర్హత ఉంటే, మీకు మెచ్యూరిటీ ఉంటే, పూర్వజన్మల కృషి ఉంటే, మీ బుద్ధి బాగా పక్వానికి వచ్చి ఉంటే ఆ మౌనం యొక్క భాష మీకు అవగాహన అవుతుంది గాని లేకపోతే దానిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. మాటకు ముగింపు ఉందికాని మౌనసందేశానికి ముగింపు లేదు. మీరు చేసే సాధన వూరికే పోదు. అందుచేత ప్రయత్నం చేస్తూనే ఉండాలి.

మనం ఇంపెర్సనల్ లైఫ్ అలవాటు చేసుకోవాలి. వ్యక్తిభావన లేకుండా జీవిస్తూ ఉంటే మనకు అన్నీ వచ్చేస్తాయి. మీరు కోరుకున్నవి వచ్చేస్తాయి, మీ జీవితంలో ఎప్పడూ కోరనివి కూడా వచ్చి మీ నెత్తిమీద పడతాయి. ఆల్‌బెర్ట్ ఆరకంగా జీవించాడు. మీరు పని చేస్తూ ఉండాలి, పనిచేసేవాడు కనబడకూడదు. ట్రావెలింగ్ అయిపోతూ ఉండాలి, ట్రావెలెర్ కనబడకూడదు. మాట్లాడుతూ ఉండాలి, మాట్లాడేవాడు కనబడకూడదు. మనం మాటలో, యాక్షన్‌లో ఇంపెర్సనల్‌గా ఉండాలి. మన మనస్సు ఎలా ఉంది, మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి అని ముందు చూసుకోవాలి. ఆ బలహీనతలనుండి విడుదల పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. దానికి గురువు సహాయం అవసరం. మీరు ఈశ్వరుని అన్వేషణలో ఉంటే ఆయన ఆశీస్సులు ఇవ్వటమేకాదు, మీ జీవితానికి ఏమి కావాలో అన్నీ సమకూరుస్తాడు. సత్యాన్వేషణలో మీకు సిన్సియారిటీ ఉంటే, డివోషన్ ఉంటే, డెడికేషన్ కనుక ఉంటే మీకు ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను అన్నీ ఆయనే సమకూరుస్తాడు. మీరు

అడిగినవి ఇవ్వటంకాదు, మీరు పొరపాటున ఏదైనా అడగటం మర్చిపోతే అవి కూడా ఇస్తాడు. అన్నీ ఎక్కడ జ్ఞాపకం పెట్టుకొంటాము. అందుచేత మీకు కావలసినవి అన్నీ ఆయనే ఇస్తాడు. వాడు ఈశ్వరుడు.

హిందువులకు దేవాలయాలు ఉన్నాయి, ముస్లిములకు మసీదులు ఉన్నాయి, క్రైస్తవులకు చర్చిలు ఉన్నాయి, సిక్కులకు గురుద్వారాలు ఉన్నాయి. ఇదంతా శూన్యంగా కనిపిస్తోంది. అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు కదా అది ఒక్కటి మాత్రమే సత్యం అని నాకు అనిపిస్తోంది. అది తప్పించి మిగతా విషయాలు ఉన్నట్లుగా కనిపించటమేకాని పారమార్థిక సత్యంతోటి చూస్తే అది అంతా శూన్యం అనిపిస్తోంది. అక్కడ ఏదో ఉంది అంటే వెదకాలి అని మనకు అనిపిస్తుంది. అక్కడ ఏమీ లేదని తెలిస్తే ఇంక వెదకటం ఏమిటి? అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు కదా. అది ఒక్కటే పారమార్థిక సత్యం, ఉన్నది అదే. ఒకవేళ మిగతావి ఉన్నట్లుగా కనిపించినా అది మాయ.

మీరు అందరూ సూక్ష్మబుద్ధిని, ఏకాగ్రబుద్ధిని సంపాదించుకోండి. దైవాన్ని తెలుసుకోవాలంటే కావలసింది ధనంకాదు, గుణసంపద ఉండాలి. మీకు ధనం ఉంటే బజారులో ఉన్న వస్తువులను కొనుక్కోవచ్చు కాని ధనంతో భగవంతుడిని మనం పొందలేము. మీకు సద్గుణాలు ఉంటే ఆ గుణాలతో భగవంతుడిని ఎంజాయ్ చెయ్యవచ్చు. సూది బెజ్జంలో నుండి ఒంటెను బయటకు పంపవచ్చునుకాని ధనవంతుడిని స్వర్గలోకంలోనికి పంపలేము అన్నాడు ఏసు. ఆ దేహప్రారబ్ధాన్నిబట్టి కొంతమందికి ధనం, కొంతమందికి విద్య వస్తూ ఉంటుంది. ఒకవేళ మీకు విద్య ఉన్నా, ధనం ఉన్నా అన్నీ ఉన్నా అణిగి ఉండటం నేర్చుకోవాలి. అన్నీ ఉండి ఎవడైతే అణిగి ఉంటున్నాడో వాడిమీద ఈశ్వరానుగ్రహం వర్షిస్తుంది. కాళిదాసు ఏమని చెప్పాడు అంటే మీ మనస్సును, మీ ఇంద్రియాలను ఆకర్షించే వస్తువులు, మీరు కోరుకునే వస్తువులు మీకు అందుబాటులో ఉండాలి. అప్పుడు కూడా మీరు నిర్వికారంగా ఉండాలి. విషయాలు మీకు ఎదురుగా అందుబాటులో ఉన్నప్పటికీ నిర్విషయస్థితిలో ఉంటే అప్పుడు మీరు దైవానుగ్రహానికి పాత్రులవుతారు కాని ఇది ఏదో కబుర్లవల్లరాదు. సిక్కుమతం

స్థాపించిన గురునానక్ ఒకరోజు ఉదయం తూర్పుకి ముఖంపెట్టి ధ్యానం చేసుకొంటున్నాడు. ఆ ప్రాంతాన్ని పాలించే రాజు అటుగావచ్చి అతనిని చూసాడు. ఆయన ధ్యానం పెర్ఫెక్టుగా ఉంది. ఆయన ధ్యానస్థితికి సంతోషించి మీకు ఏమి కావాలి అని గురునానక్‌ను ఆ రాజుగారు అడిగారు. సూర్యుడి యొక్క కిరణాలు నా మీద పడకుండా మీరు అడ్డు నిలబడ్డారు. మీకు ఏమి కావాలి అని మీరు నన్ను అడుగుతున్నారు. సూర్యకిరణాలు నా మీద పడకుండా మీరు అడ్డునిలబడ్డారు, దయవుంచి మీరు ప్రక్కకు తప్పకుంటే సరిపోతుంది. మీరు ప్రత్యేకంగా నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు అని గురునానక్ చెప్పాడు. అటువంటి వారికి ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు.

మనం ఏదైనా ఒక వస్తువు తినేటప్పడు నోట్లో పెట్టుకొని చూస్తాము. అది రుచిగా ఉంటే తింటాము లేకపోతే ఊసేస్తాము. అలాగే మన లోపలఉన్న గురువు ఈ జీవుడికి ఎంతవరకు అర్హత వచ్చింది, ఎంతవరకు పక్వత వచ్చింది, వీడు ముగ్గితే తన స్వరూపాన్ని ఇద్దాము అని కొంచెం నోట్లోపెట్టుకొని చూస్తే మనం చేదుగా, పుల్లగా తగులుతున్నాము. ఇంక ఆయన మాత్రం ఏమి చేయగలడు? ఊసేస్తున్నాడు. అంటే మన జీవుడికి ఇంకా స్వీట్‌నెస్ రాలేదు. మనకు ఆ ఏకాగ్రత, పవిత్రత ఇంకా రాలేదు. మనకు ఏకాంతజీవితం అలవాటులేదు. చుట్టూ పదిమందిని వేసుకొని తిరుగుతూ ఉంటాము. ఇప్పడు ఇలా జనంతో కలిసి తిరుగుతున్నా చనిపోయేటప్పడు ఒంటరిగానే ప్రయాణం చెయ్యాలికాని ఎవరూ నీ కూడా రారు. నీ కుటుంబ సభ్యులు కూడా నీ కూడా రారు. మరణానంతరం నీవు ఒంటరిగా ప్రయాణం చేయవలసిందే మరి ఇప్పడు ఏకాంతవాసంగా ఎందుకు ఉండలేకపోతున్నావు? ఇంటి దగ్గర ఏకాంతవాసాన్ని ప్రాక్టీసు చెయ్యండి. ఏకాంతవాసం కోసం ఎక్కడికో అడవిలోనికి పారిపోనక్కరలేదు. మీ ఇంటిదగ్గరే రోజూ కొద్దిసేపు ఏకాంతవాసంగా ఉంటే మీ మనస్సు ఎలా ఉంది, మీ మనస్సు యొక్క వాండరింగ్ ఎలా ఉంది, మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి అని మీకు తెలుస్తాయి. మీ మనస్సులో యిష్టాలు ఉన్నా, అయిష్టాలు ఉన్నా కూడా మనస్సు బాహ్యముఖానికి పోతుంది. అందుచేత లైక్స్ ఎంతప్రమాదమో, డిజ్‌లైక్స్ కూడా అంతే ప్రమాదము. ముందు రోగనిర్ధారణ అయిన

తరువాత దానికి మెడిసిన్ అలాగే మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో మీకు తెలిసిన తరువాత వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మీ ప్రయత్నంలో సిన్సియారిటీ ఉంటే, డివోషన్ ఉంటే, డెడికేషన్ ఉంటే, ఈ జన్మలోనే మీకు లిబరేషన్ ఇవ్వాలి అని ఆయన అనుకొంటే అప్పుడు భగవంతుడు సర్జరీ ప్రారంభిస్తాడు. మీరు ఎన్ని సాధనలు చేసినప్పటికీ, మీకు అర్హత ఉంది, యోగ్యత ఉంది, మేము తయారైపోయాము అని మీ అంతట మీరు అనుకొన్నప్పటికీ, సర్జరీకి వీళ్ళు తట్టుకోలేరు అని ఈశ్వరుడు నిర్ణయించినప్పుడు సర్జరీ ప్రారంభించడు. ఈ విషయాలు అన్నీ ఎందుకు చెపుతున్నాను అంటే చివరిలో ఈశ్వరుని యొక్క ఇంటర్‌ఫియరెన్స్ లేకుండా, ఆయన కలుగజేసుకోకుండా మోక్షానుభవం, నిర్వాణసుఖం రావటానికి అవకాశం లేదు.

మేము చాలా సాధన చేస్తున్నాము, ఉపనిషత్‌లు చదివాము, వివేకచూడామణి చదివాము, భగవద్గీత చదివాము అంటే సరిపోదు. నాలెడ్జ్ మస్ట్ బి జాయిన్డ్ విత్ గుడ్‌నెస్, విత్ హోలీనెస్, విత్ నోబుల్‌నెస్. మీకు ఎన్ని తెలివితేటలు ఉన్నప్పటికీ, మీకు సూక్ష్మబుద్ధి ఉన్నప్పటికీ మీ హృదయం విశాలం కాకపోతే, లోపల ఉండవలసినంత పవిత్రత లేకపోతే, ఏకాగ్రత లేకపోతే ఈశ్వరానుగ్రహం మీకు అందదు, మోక్షానుభవం మీకు కలుగదు. అందుచేత రెండూ ఉండాలి. విషయాన్ని గ్రహించేశక్తి ఆ తెలివితేటలు ఉండాలి, దానికి తగ్గట్టుగా లోపల పవిత్రత ఉండాలి, హృదయం విశాలంగా ఉండాలి. వట్టిమాటలు కట్టిపెట్టు, గట్టిమేలు తలపెట్టు అని గురజాడ అప్పారావుగారు చెప్పారు. భౌతికంగా చూస్తే మనచేతికి, నోటికి దగ్గరగానే ఉన్నాము. లోపలకు వెళ్ళి చూస్తే నోటికి, చేతికి ఎంతదూరంగా ఉన్నామో. అంటే భౌతికంగా నోరు, చెయ్యి దగ్గరగానే ఉన్నప్పటికీ లోపలకు వెళ్ళి చూస్తే మన మాటకు, చేతకు చాలా దూరంగా ఉన్నాము. మన మనస్సు, మాట, చేత ఒకటిగా ఉండాలి. నీ మాటలను చూసి భగవంతుడు మోసపోడు. లోపల ఏ ప్రేరణ వలన నువ్వు మాట్లాడుతున్నావు, ఏ ప్రేరణ వలన నువ్వు పని చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు. నీ మాటల వలన, గారిడీల వలన, జిమ్మిక్కుల వలన ఆయన మోసపోడు. మనకు వచ్చే తలంపులను, ఆలోచనలను వైకుంఠంలో ఉన్న నారాయణుడు చూడకపోవచ్చు, కైలాసంలో ఉన్న శివుడు

చూడకపోవచ్చు కాని నీలో అంతర్యామిగా ఉన్నవాడు నీకు వచ్చే ప్రతీ తలంపుకు, ఆలోచనకు ఆయన సాక్షిగా ఉన్నాడు. ఆయన సాక్షిగా ఉండటమేకాదు, ఆయన పట్ల నీకు విశ్వాసం ఉంటే, డివోషన్ కనుక ఉంటే మీలో ఉన్న బలహీనతలను మీకు నెమ్మదిగా తెలియజేసి, ప్రతీ జన్మలోను మీ కూడా ఉండి ఆ బలహీనతలు నుండి విడుదల పొందటానికి మీకు సహాయ సహకారములు అందిస్తాడు.

మామూలుగా ఉపన్యాసాలు చెప్పటంవేరు, అనుభవంపొంది చెప్పటం వేరు. బుద్ధగయలో బోధివృక్షం కింద అనుభవం పొందాక తను పొందిన అనుభవాన్ని సమాజానికి టీచ్ చేయటమా? లేక మన పద్ధతిలో మనం ఇలా కూర్చుని ఉండటమా? అనేటువంటి ఘర్షణ బుద్ధుడిలో వచ్చింది. అలాగే ఆ చెట్టుని చూస్తూ 12 గంటలు ఉండిపోయాడు. అప్పుడు లోపల నుండి ఆయనకు సమాధానం వచ్చింది. "గౌతమ్ నువ్వు పొందినది పుస్తకాలు చదివి చెప్పేదికాదు. దాని గురించి శాస్త్రపండితులు చెప్పలేరు. అది నువ్వే చెప్పాలి. నువ్వు సమాజానికి చెప్పవలసిన మెస్సేజ్ ఉంది. అందువలన నువ్వు మౌనంగా ఉండటంకంటే సమాజానికి టీచ్ చేయటం మంచిది" అని లోపలనుండి ఆయనకు సమాధానం వచ్చింది. అప్పుడు అక్కడ నుండి సారనాథ్ బయలుదేరాడు. ఆయన ఏ స్థితిని అయితే పొందాడో అది గ్రంథాలు చదివి చెప్పేదికాదు, అది అనుభవైకవేద్యం. దాని గురించి చెప్పటం ఆ స్థితిని అనుభవించేవాడికి మాత్రమే సాధ్యం. ఆ స్థితి మాకు లేదు కాబట్టి మీకు న్యాయం చేయలేకపోతున్నాము. ఏదో చెపుతున్నాము కాని మీకు న్యాయం చేయటంలేదు అనిపిస్తోంది. నిర్వాణస్థితి పొందినవాడు ఎలా ఉంటాడు అంటే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, అన్ని ప్రదేశాలలో, అన్ని పరిస్థితులలో ధైర్యం కలిగి ఉంటాడు. అలా ఉండటం మనలాంటి వారికి సాధ్యంకాదు. మనం పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఒకరకంగా ఉంటాము, పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఒకరకంగా ఉంటాము. దేహప్రారబ్ధం మనకు అనుకూలంగా ఉంటే సంతోషంగా ఉంటాము, ఎగిరిఎగిరి పడతాము. దేహప్రారబ్ధం మనకు వ్యతిరేకంగా ఉంటే దుఃఖపడతాము, కుంగిపోతూ ఉంటాము. ఇలా హెచ్చుతగ్గులతో మన జీవితాలు వెళ్లిపోతున్నాయి. ఈ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా కూల్‌గా, కామ్‌గా ఉన్న సమాన

స్థితి ఒకటి మన హృదయంలో ఉంది, దాని గురించి మనం ఆలోచించలేకపోతున్నాము, దానిని మనం అందుకోలేకపోతున్నాము.

మనకి కోపంగా ఉన్నప్పుడు మాట్లాడకుండా ఉండటం మంచిది. ఎక్కువ కోపంగా ఉన్నప్పుడు మాట్లాడితే ఏవో చెడ్డ మాటలు వస్తాయి. తరువాత మన మాటలకు మనమే సమాధానం చెప్పవలసి ఉంటుంది, అక్కడ నుండి మన మాటలకి మనమే దుఃఖపడాలి. అందుచేత మనకు కోపం వచ్చినప్పడు మౌనంగా ఉండటం మంచిది. జీవితానికి, చావుకీ మధ్యన తేడా మీకు కనిపిస్తూ ఉంటే మీరు నిర్వాణసుఖానికి ఫిట్‌కారు అని బయటకు పంపేస్తారు. అంటే మీకు అర్హతలేదు అని అర్థం. ఇప్పడు మనం ఉన్నాము అనుకొంటున్నాము ఈ దేహం చనిపోయిన తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. అంటే లైఫ్‌కు డెత్‌కు మనకు తేడా తెలుస్తోంది. లైఫ్‌కు, డెత్‌కు నాకు తేడా తెలియటంలేదు అని నీవు ఏదో బడాయిమాటలు చెప్పినా ఒకవేళ నేను నమ్మినా అంతర్యామి మాత్రం నమ్మడు. వాడు లోపల ఉండి అంతా గమనిస్తూ ఉంటాడు, ప్రతీ జన్మలోను వాడు వాచింగ్‌లో ఉంటాడు. నిర్వాణసుఖాన్ని పొందటానికి నీవు రెడీగా ఉన్నావు, నీకు అర్హత వచ్చింది అని ఆయన అనుకొన్నప్పడు ఆయన కలుగజేసుకొంటాడు, వెంటనే సర్జరీ ప్రారంభిస్తాడు. మనకు యిటువంటి శరీరాలు అనేకం వచ్చాయి, భవిష్యత్‌లో కొన్నివేల శరీరాలు రావచ్చు. అవి జంతుశరీరాలు అవ్వవచ్చు, మానవశరీరాలు అవ్వవచ్చు. మనం ఏ శరీరంలో ఉంటే అది ఒక్కటే నిజం, అదే నేను అనిపిస్తుంది. ఆ శరీరమే నేను అనుకొంటాము గాని నాకో శరీరం ఉందని మటుకు అనుకోము. ఆ అలవాటు మనకు లేదు. వాళ్ళకంటే మేము ఎక్కువవాళ్ళము వీళ్ళకంటే మేము ఎక్కువవాళ్ళము అని చాలామంది అనుకొంటారు. మీలో ఎక్కడో రాంగ్ తింకింగ్ ఉంది కాబట్టి యిటువంటి తలంపులు అన్నీ వస్తున్నాయి. మీలో రాంగ్ తింకింగ్ ఉన్నట్లు అంతర్యామి చూస్తూ ఉంటాడు, యింక మీకు సర్జరీ చెయ్యడు, అంటే మీరు సర్జరీకు ఫిట్ అవ్వలేదు అని అర్థం.

లోకంలో చాలామంది టీచర్లు ఉన్నారు కదా! మమ్మల్ని ఎవరిని గురువుగా ఎన్నుకోమంటారు అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీ సాధనతోటి, నీ కోరికతోటి సంబంధం

లేకుండా ఎవరి సమక్షంలో ఉన్నప్పడు వాళ్ళ వైబ్రేషన్స్ వచ్చి నిన్ను శాంతితోటి, కాంతితోటి ముంచేస్తున్నాయో వారిని నువ్వు గురువుగా ఎన్నుకో. నా గురువు నాకు ఎలా తెలుస్తాడు అంటే నీకు ఏకాగ్రత ఉంటే, పవిత్రత ఉంటే, ధ్యానం చేసే శక్తి ఉంటే ఆయన నీకు తెలుస్తాడు. మీకు చదువు ఉండవచ్చు, ధనం ఉండవచ్చు, మహిమలు చేసే శక్తి మీకు ఉండవచ్చు, ఎన్ని ఉన్నప్పటికీ ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు యొక్క కటాక్షం లేకుండా నువ్వు దేనినైతే పొందాలి అనుకొంటున్నావో దానిని పొందలేవు, ఇందులో రాజీలేదు. నిజం నీ హృదయంలోనే ఉంది కాని ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా దానిని నీవు పొందలేవు, నీకు హృదయంలో ఉన్న సత్యం అనుభవంలోనికి రాదు.

ఒక అమెరికన్ సైంటిస్టు భగవాన్ దగ్గరకు వచ్చాడు. ఈ శరీరం ఎప్పడైతే చనిపోతుందో అప్పటితో జీవితయాత్ర ముగిసిపోతుంది అని ఆయన నమ్మేవాడు. ఆయన అమెరికా వెళ్ళిన తరువాత ఒకమీటింగ్‌లో మాట్లాడుతూ నేను సౌత్ఇండియాలో ఒక మహర్షిని చూసాను. నేను ఆయనతో మాట్లాడలేదు, ఆయన నాతో మాట్లాడలేదు, ఒక గంటసేపు అక్కడ కూర్చున్నాను. ఆయన సమక్షంలో ఉండగా ఈ దేహానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా, మన ఆలోచనలకు అతీతంగా నా హృదయంలో ఒక నిజం ఉందని నాకు స్ఫురించింది. ఆ నిజం నాకు తెలియటంలేదు అన్న సంగతి కూడా తెలుస్తోంది అని చెప్పాడు. ఇక్కడ భగవాన్ వాడికి చేసిన సహాయం ఏమిటి? ఆ నిజాన్ని వాడికి ఎరుకలోనికి తీసుకురాలేదు. ఏదో ఒక నిజం ఉందని ఆయన సమక్షంలో వాడికి స్ఫురించింది. అంటే దానిని తెలుసుకోవాలని అన్వేషణ ప్రారంభమవుతుంది. అంటే ఆ కోణంలో ఎంతోకొంత సాధన మొదలుపెడతాడు. ఆచార్యులవారిని ఒక కష్టమైన ప్రశ్న అడిగారు. ఇదంతా మిధ్య, యిదేమి నిజంకాదు, నిజంవలె కనిపిస్తోంది అని చెపుతున్నారు. ఇదంతా నిజంకానప్పడు మీరు ఇంత కష్టపడి టీచింగ్ చెయ్యటం ఎందుకు అని ప్రశ్న? దీనికి సమాధానం చెప్పటం చాలా కష్టం. అది ఎక్స్‌పీరియన్స్‌లోనుండి రావలసిందే కాని లెర్నింగ్‌లో రాదు. ఆచార్యులవారు చెప్పిన సమాధానం ఏమిటి అంటే మనకు స్వప్నాలు వస్తూ ఉంటాయి. ఒక పులి స్వప్నంలో వచ్చింది అనుకోండి. అప్పడు మీకు భయం వేస్తుంది, వెంటనే మెలకువ వచ్చేస్తుంది. ఆ

పులి నిజమా, అబద్ధమా అని అడిగారు. అబద్ధమే అని చెప్పాడు. నీకు మెలకువ రావటం నిజమా, అబద్ధమా అని అడిగారు. నిజమే అని చెప్పాడు. నా టీచింగ్ కూడా అటువంటిదే అన్నారు ఆచార్యులవారు. స్వప్నంలో వచ్చిన పులి మీకు నిద్రలో నుండి మెలకువ తీసుకొని వచ్చింది. ఇప్పడు మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. నా టీచింగ్ కూడా పులి వంటిదే. అది అసత్యం అయినప్పటికీ అజ్ఞానమనే నిద్రనుండి నీకు మెలుకువ తీసుకొనివస్తుంది. నా టీచింగ్ అసత్యం అయినా దాని వలన మీరు ఎక్కడకు మేల్కొంటారో, ఏ గమ్యాన్ని చేరుకొంటారో అది మాత్రం సత్యం అని చెప్పారు.

మీ దుఃఖాన్ని ఎవరు ఆర్పగలరు అంటే అది గురువుకే సాధ్యం. మీరు అంటే మీ అమ్మగారికి యిష్టం అనుకోండి. డబ్బు యిస్తారు, నాలుగు ఎకరాలు పొలం యిస్తారు అంతే గాని మీ దుఃఖాన్ని ఆర్పలేరు. మిమ్మల్ని దుఃఖంలేనిస్థితికి తీసుకొని పోవాలంటే అది భగవంతుడే చేయాలి, అది గురువుకే సాధ్యం కాని యింకొకడికి యోగ్యత లేదు. మాస్టారును ఆశ్రయిస్తే పాఠాలు చెపుతారు, ఒక ధనవంతుడిని ఆశ్రయిస్తే వాడు నాలుగు డబ్బులు యిస్తాడు అంతేగాని మీ దుఃఖాన్ని వారు తీయలేరు. మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొనిపోవాలంటే అది ఒక్క గురువుకే సాధ్యం. బుద్ధుడు సారనాథ్‌లో ఆరునెలలు ఉన్నాడు. సారనాధ్ విడిచివెళ్ళిపోతున్నాడు. ఒక ధనవంతుడి కుమారుడు ఇంటిదగ్గర ఏవో పేచీలు వచ్చి రోడ్డు ప్రక్కన కూర్చొని ఏడుస్తున్నాడు. బుద్ధుడు ఏమన్నాడు అంటే ఏడుస్తున్నావా, ఏడుపులోనుండి ఎలా బయటకురావాలో నీకు తెలియటంలేదు. రా, నాకూడా రా, నీకు మార్గం చూపిస్తాను, దుఃఖంలో నుండి ఎలా బయటకు రావాలో నీకు మార్గం చూపిస్తాను అంటున్నాడు. అంత స్పెసిఫిక్‌గా చెపుతాడు, నిన్ను దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికి హామీ ఇచ్చి మాట్లాడతాడు. అంటే లోపల దాని తాలూక అనుభవం ఎంత స్థిరంగా ఉండాలి. మీరు బురద నేలల్లో మేడలు కట్టుకోవద్దు, రాతినేల మీద కట్టుకోండి అంటాడు ఏసు. అంటే పునాది బలంగా ఉండాలి. శీలం యొక్క బలం లేకుండా ఆధ్యాత్మిక పురోగతి సాధ్యంకాదు. మీకు ధనం ఉండవచ్చు కాని శీలం యొక్క బలం లేకపోతే ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిలోనికి రాలేరు. గుడ్ కాండక్ట్ అవసరం. కాండక్ట్ అనే పునాది మీద స్పిరిట్యువల్ లైఫ్ సాధ్యమవుతుంది

కాని కాండక్ట్ వీక్‌గా ఉంటే స్పిరిట్యువల్ లైఫ్ సాధ్యంకాదు.

గురువు నన్ను ప్రేమిస్తున్నాడని, నాపట్ల దయచూపిస్తున్నాడు అని నాకు ఎలా తెలుస్తుంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. అది మాటలకు అందదు, గురువు కృప ఇలా ఉంటుంది అనటానికి అది చేత్తో వ్రాసేది కాదు, నోటితో చెప్పటం అసాధ్యం. మాటలకు అందని దానిని, యింద్రియాలకు అందని దానిని, మనస్సుకు అందని దానిని ఎలా ఉంటుంది అని అడిగితే నేనేమి చెపుతాను. అది అనుభవైకవేద్యం. రామకృష్ణుడు కొంతమందికి టచ్ చేసి ఆ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేవాడు. అలా ఒకసారి నరేంద్రుడిని టచ్‌చేసాడు. ఏమిటి నాకు ఇంటిదగ్గర అమ్మ ఉంది, తమ్ముళ్ళు ఉన్నారు. నా కుటుంబానికి నన్ను దూరం చేస్తావా? ఏదో గురువు అని నీ దగ్గరకు వస్తే ఇలా అల్లరి చేస్తున్నావు ఏమిటి? యిదేమి పద్ధతి అని గొడవ చేసాడు. మరల టచ్ చేసి ఇంకా దూరమయితే చనిపోయేలాగ ఉన్నాడని, ప్రస్తుతానికి, యిది చాలు అని వదిలేసాడు. ఇద్దరికి తేడా ఏమిటి అంటే వివేకానందుడికి బాగా ఏకాగ్రత ఉంది, రామకృష్ణుడిది నోమైండ్ స్టేట్, అసలు మనస్సు లేదు. కష్టపడి డబ్బు సంపాదించాలి, బాగా అభివృద్ధి లోనికి రావాలి, చదువుకొని పండితుడిని అవ్వాలి అని చాలామందికి ఉంటుంది కదా, రామకృష్ణుడికి చిన్నతనం నుండి అటువంటి తలంపులు ఆయన జీవితంలో రాలేదు. దక్షిణామూర్తి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నాడు. ఆమౌనం ఎక్కడనుండి వస్తోంది అంటే మనోనాశనం లోనుండి వస్తోంది. సనత్ కుమారుడు వాళ్ళు నలుగురు అక్కడ కూర్చున్నారు. దక్షిణామూర్తి వారితో మాట్లాడలేదు. మౌనంగా కూర్చొన్నాడు. ఆ మౌనం అనే మంటలో వారికి ఉన్న వందలాది సందేహాలు కాలి బూడిద అయిపోయాయి. కొన్ని క్షణాలలో ఇది అంతా జరిగిపోయింది. మౌనానికి అంత శక్తి ఉంది. మౌనం అంటే నోరు మూసుకొని కూర్చోవటం కాదు, మనస్సు అణగటం కాదు, మనోనాశనం ఎక్కడయితే అయిందో అక్కడ నుండి మౌనం వస్తుంది.

మేమందరము సత్యానుభవం పొందాలి, దానికి మీరు ఏదైనా సహాయం చేస్తారా అని అడిగితే అటువంటి ప్రశ్నలు అడగకండి. మీకు సహాయం చేయటం తప్పించి యింకోటి మా దగ్గర ఏముంది? ఒకవేళ మీకు సహాయం చెయ్యకూడదు అని అనుకున్నా సహాయం

చెయ్యకుండా ఉండలేము. మా దగ్గర ఉన్నదే అనుగ్రహం. ఒకవేళ మమ్మల్ని అనుగ్రహం కాకుండా ఇంకోటి అడిగినా మా దగ్గరలేదు. మీరు డిజర్వు అయితే, మీరు ఎంతవరకు డిజర్వు అయ్యారో అంతవరకూ మా అనుగ్రహం ప్రవహిస్తూనే ఉంటుంది. ఇంక అడగటం ఎందుకు? అడిగిన వారికే పెట్టి, అడగని వారికి ఇవ్వకుండా ఉంటామా? ఇంక అప్పుడు సమానత్వం ఏముంది? మేము సహజంగానే ఇచ్చే దానిని మీరు అడగటం ఎందుకు? మీకు మా సహాయం ఉంది అంటున్నారు. అది మాకు ఎలా తెలుస్తుంది? మేము సాటిస్ఫై అవ్వాలంటే అది మాకు తెలియాలి కదా అని అడుగుతున్నారు. అది శరణాగతి వలన తెలుస్తుంది. ఈ ప్రశ్నలు అన్నీ ఎందుకు వస్తున్నాయి అంటే నిన్ను నువ్వు దేహంగానే గుర్తిస్తున్నావు, గురువు అంటే ఆ దేహమే అనుకొంటున్నావు. అందుచేత ఇటువంటి సందేహాలు అన్నీ నీకు వస్తున్నాయి, గతి అల్లా శరణాగతే. నువ్వు శరణాగతి పొందితే అసలు ఇటువంటి సందేహాలు రానే రావు.

సద్గురువు ఎక్కడ ఉన్నాడు? నీ లోపలే ఉన్నాడు. అయితే నా కళ్ళకు కనిపించాలి కదా! నీ కళ్ళకు కనిపించే గురువే నీ లోపల సద్గురువు ఉన్నాడని చెపుతున్నాడు. నేను సక్సెస్ అవ్వాలంటే గురువు యొక్క కృప అవసరం అని చెపుతున్నారు కదా మరి గురువు యొక్క అనుగ్రహం పొందటానికి నేను ఇప్పుడు ఎంతోకొంత ప్రయత్నం చేస్తాను. నేను ప్రయత్నం చేస్తాను, అభ్యాసం చేస్తాను అని చెపుతున్నావు. అభ్యాసం చేయాలనే తలంపు కూడా గురువు అనుగ్రహం లేకుండా నీకు ఎక్కడ నుండి వచ్చిందివయ్యా? పో బయటకు పో. అసలు నువ్వు ఎక్కడ ఉన్నావు. నేను అభ్యాసం చేస్తాను అనే బుద్ధి కలగటం కూడా గురువు అనుగ్రహమే. అది నీ సొంతం కాదు. నువ్వు అంటూ అసలు లేనే లేవు. నేను ప్రయత్నం చేస్తాను అని చెప్పేవాడు దొంగనేను. అసలు వాడు ఉంటే కదా? గురువు ఎప్పుడూ నీతోటే ఉంటాడు. ఈ శరీరం మరణించినప్పుడు శరీరగతమైన బంధువులు, స్నేహితులు, ఆస్తులు వీటిఅన్నింటితో సంబంధం తెగిపోతుంది కాని ఒక్క గురువుతో ఉన్న సంబంధం మాత్రం తెగదు. ఎందుచేతనంటే వాడు నీ దేహంలో ఒక భాగం కాదు కాబట్టి దేహం కాలిపోయినప్పడు వాడు కాలిపోడు. వాడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. నువ్వు

కోటి జన్మలు ఎత్తినా గురువు మాత్రం నీతోటే ఉంటాడు. నీతో ఉండటమే కాదు నువ్వు ఏ డైరెక్షన్‌లో వెళుతున్నావో చూస్తూ ఎక్కడ నీకు టర్నింగ్ పాయింట్ తీసుకొని రావాలో చూస్తాడు. ఏ టైములో ఏ పని చేయాలో, ఎప్పుడు నీకు మెచ్యూరిటీ ఇవ్వాలో చూస్తూ మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. గురువు ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని మీరు పొందేవరకు, గురువుతో ఒన్‌నెస్ సాధించేవరకు ప్రతిజన్మలోను నిన్ను వెంటాడతాడు. వాడే నిజమైన గురువు. ఇప్పుడు గురువు వేరు, ట్రూత్ వేరు అనుకొంటున్నావు. ట్రూత్‌కు రూపం లేకపోయినా నాకోసం గురురూపం ధరించి నన్ను వెంటాడుతోంది, గురువే ట్రూత్ అని ట్రూత్‌ను రీలైజ్ చేసాక నీకు తెలుస్తుంది అప్పటివరకు గురువే ట్రూత్ అని మీకు తెలియదు. మీరు తొందరపడకండి. మీకు ఎప్పుడు ఎక్కడ ఏది అవసరమో మీరు మర్చిపోయినా గురువు మరిచిపోడు. మీకు మైండ్ ఉంది కాబట్టి మరుపు వస్తుంది, గురువు మరిచిపోయే సమస్య లేదు. ఆయన అంతటా ఉన్నాడు. ఆయన చెయ్యవలసిన డ్యూటీ ఆయన చేస్తాడు. ఆ టైము వచ్చినప్పుడు నీకు స్పిరిట్యువల్ ప్రోగ్రెస్ ఇస్తాడు.

గురువు నీతో మాట్లాడుతూ ఉంటాడు. మామూలుగా నీకు భక్తి మాటలు చెపుతాడు. కుటుంబం గురించి అడుగుతూ ఉంటాడు, పిల్లల చదువుల గురించి పెళ్ళిళ్ళు గురించి అడుగుతూ ఇలా ఏవో మాయమాటలు చెపుతూ నువ్వు పరాగ్గా ఉన్నప్పుడు చూసి నీ మనస్సును అగాధంలోనికి, లోయలలోనికి గెంటేస్తాడు. మీతో కలిసి తిరుగుతూ, ఏవో మాటలు చెపుతూ ఎప్పడో సడన్‌గా కిందకు నీ మనస్సును నొక్కేస్తాడు అంటే ఎక్కడైతే ట్రూత్ ఉందో అక్కడకు నీ మనస్సును గెంటివేస్తాడు. గురువు చేసే సహాయం మనం మాటలతో చెప్పలేము. దుఃఖస్పర్శలేని స్థితికి మిమ్మల్ని మోసుకొని పోతాడు వాడు గురువు. ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే మీరు సత్యానుభవం పొందటంమాట అటు ఉంచండి. ముందు సబ్జక్టును అర్థం చేసుకోండి, దానిని ఎంజాయ్‌చెయ్యండి, దానిని అనుభవైకవేద్యం చేసుకోండి. సబ్జక్టును ఎంజాయ్ చెయ్యటం నేర్చుకొంటే ఎప్పుడైతే మీకు ఆ ఎంజాయ్‌మెంట్ వచ్చిందో ఇప్పటివరకు బాహ్యంగా మీకు కొన్ని వరల్డ్‌లీ ఎంజాయ్‌మెంట్స్ ఉన్నాయి కదా వాటి మీద మీకు టేస్టు పోతుంది అంటున్నాడు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రద్ధాంజలి

ఏప్రియల్ నెల అనగానే రమణభక్తులకు భగవాన్ శ్రీరమణమహర్షి అవతార సమాప్తి గుర్తుకొస్తుంది. తారీఖు ప్రకారం 14 ఏప్రియల్ 1950, రాత్రి 8 గం॥ 47 ని॥లకు అరుణాచలక్షేత్రంలో అమృతుడైన భగవాన్ శ్రీరమణుడు తన పార్థివశరీరాన్ని విడిచిపెట్టాడు. వేంకట్రామన్ తన 17వ ఏట మధురైలో, మృత్యువును ముఖాముఖీ ఎదుర్కొని దేహాత్మబుద్ధినుండి విడుదలపొంది అమృతుడయ్యాడు. అట్టి మృత్యుంజయునికి తన శరీర మరణం మరణమే కాదు! రమణుడంటే జనన మరణాలకు, దేశకాలకారణాలకు, అతీతమైన కేవల ఉనికి. భగవాన్ అవతార సమాప్తికి కొద్ది రోజులు ముందు కొంతమంది భక్తులు భగవాన్‌తో "స్వామీ మీరు మమ్ములను విడిచివెళ్ళిపోతే మా గతి ఏమిటి? మమ్ములను ఎవరు అనుగ్రహిస్తారు? అని దుఃఖించగా, 'నేను' ఎక్కడికి వెళ్ళగలను? నేను ఇక్కడే ఉంటాను", అని బదులిచ్చారు. జాతస్య మరణం ధృవం అంటారు. పుట్టిన శరీరానికే మరణం, అందువలన దాని గురించి శోకించడం తగదు. మరి స్వరూపం పుట్టుక మరణం లేని అమృతస్థితి. భగవాన్ ఏ మార్గాన్ని ఖండించలేదు. సకల జీవకోటి మీద ప్రేమ, దయను చూపించారు. భగవాన్ శ్రీ రమణమహర్షి అనుగ్రహస్వరూపుడు. ఆయన ఎల్లప్పుడు తన సహజస్థితిలో ఉండి, ఒక సామాన్య మానవునివలె అరుణాచలంలో సంచరించి, తన దివ్యసందేశాన్ని మానవాళికి అందించారు. భగవాన్ బోధించిన మార్గాన్ని అనుసరించి అంతిమసత్యం లోనికి మేల్కోవాలి. నేను అంటే దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన చైతన్యము కాబట్టి, దేహము మరణించేలోపు దేహాత్మబుద్ధినుండి విడుదలపొంది, పరమశాంతిని తానుగా అనుభవంలోనికి తెచ్చుకుంటే, మనము ఈ భూమి మీదకు మానవులుగా వచ్చిన పని పూర్తి అవుతుంది.

**ఓంతత్‌సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# బుద్ధం శరణం గచ్ఛామి - 1

'బుద్ధం' అంటే మేల్కొన్నవారు అని. అది వ్యక్తిగతమైన పేరుకాదు. బుద్ధుడు హిందూమత సంస్కర్త. దశావతారాల్లో ఒకటి. ఆయన విశిష్టమైన ఆకర్షణ, పూజ్యభావం మానవకోటిలో నిర్భయత్వము, దివ్యప్రేమ ఎక్కడా కానరాదు. లోకంలో దుఃఖం తొలగించాలనే ఆయన ఆశయం. తత్వతః మేధావి, ధీమంతుడు, వీరుడు రాజ్యాలు పాదాక్రాంతమైనను స్థితప్రజ్ఞుడిగా ఉండిపోయాడు. ప్రపంచ పూజితుడైన బుద్ధుడు ఆయన మరణంలోనూ సామాన్యమానవునికన్నా గొప్ప అనే భావన లేదు. నీ ముక్తికి నీవే జాగ్రత్తపడు అనేవారు. క్రూరమైన పురోహిత శక్తి ఎదుట తలవంచి ఎరుగడు. మంచికోసం మంచి, నిష్కాముడవై నిలువు అనేవారు. అటువంటి మహాశక్తిని కనీవిని ఎరుగము. మేధాశక్తి ద్వారా కోట్లాది మందిని తనలో చేర్చుకొన్నాడు. రక్తపాతం, కత్తి లేకుండా ప్రేమతో ద్వేషాన్ని జయించాడు. కీడుతో కీడును బదులిస్తే మొదటి కీడు శమించదు కదా? కోరిక కొన్ని కర్మలతో భౌతిక లోకానికి కట్టేస్తుంది. అటువంటి వాడు సంతోషాలను, దుఃఖాలను మరల మరల అనుభవిస్తాడు. శరీరం సత్యమైనదని, అందమైనదని భ్రమించి దుఃఖరాహిత్యానికి కొనిపోయే మార్గాన్ని చూడలేకపోతున్నాము. అదే బంధం దాన్ని తెలుసుకోకతప్పదు. బుద్ధుడు "ఎరుక అనే దీపాన్ని మీ హృదయంలో వెలిగించండి మీ ఉనికి పూర్తిగా కరుణతో విరజిమ్ముతూ శోభిస్తుంది" అనేవారు, ఆ కరుణ మనలో లేకపోతే మనలను మనం మోసం చేసుకొన్నట్లే, ఇంద్రియ భ్రమలపై ఆధారపడకూడదు. జాగృతిపైనే ఆధారపడాలి. ఇంద్రియాలు గోళాలు కన్ను చూడదు అది ఒక పరికరం దాని ద్వారా మనస్సు చూస్తుంది అది నిజం కాదు. బుద్ధుడు "కోరిక కలిగినప్పుడు చెప్పకూడదు. అలా చూడు లోపల అణచకూడదు, దాన్ని నిందించకు, దానితో పోట్లాడకు, విలువ కట్టకు, తీర్మానించకు, గమనించు" అన్నారు. జాగ్రదవస్థలో అణిచేస్తే స్వప్నంలో పైకి తేలుతుంది. అప్పుడు ఎరుకలేక సమ్మతించి తీరాలి. జరగబోయే పరిణామాలకు ఉదాసీనంగా ఉండాలి. 'బుద్ధం శరణం గచ్ఛామి' అని దేవాలయాలకు వెళితే ప్రయోజనం లేదు. జీవించి ఉన్న బుద్ధుణ్ణి (సద్గురువును) వెదుక్కోవాలి. మరో దగ్గర మార్గంలేదు. వెయ్యి నైవేద్యాలకన్నా గొప్పదైనది తనను తాను జయించటం. అది శూన్యము యొక్క అర్థం. అంటే అన్ని కోరికలను వదలి పూర్తిగా ఏమీ లేకుండా ఉండటం. అప్పడే సర్వం లభిస్తుంది. పూర్ణం యొక్క ద్వారమే శూన్యము. శ్రీనాన్నగారు "ఒక్క దయ విషయంలో బుద్ధునితో పోలిస్తే నా రమణుణ్ణికూడా ప్రక్కన పెడతాను" అన్నారు. సత్కర్మ చేసి చేసి ప్రచారం చేసుకోకుండా తనలో తాను కరిగిపోయి నిశ్శబ్ధముగా జీవించి వెళ్ళిన వారిలో మొదటివాడు బుద్ధభగవానుడు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**